

సేవల్లేక జనం విలవిల.. ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాల

సచివాలయ సేవలకు మంగళం పలికిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సర్వే పేరుతో తిప్పుతోంది. - 8లో..



యువత పోరును జయప్రదం చేయాలి

నేడు ఒంగోలులో చేపట్టిన యువత పోరును జయప్రదం చేయాలని మాజీ మంత్రి సురేష్ కోరారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

బుధవారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 24	
గురువారం	సహరి	
ఉదయం	గం 4 : 58	

రంజాన్ వేళలు



కూటమి ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేస్తోంది. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయక యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా రూ.218 కోట్లు బకాయిలు పెట్టి పేదింటి బిడ్డలకు ఉన్నత చదువులు భారం చేసింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, లేకుంటే భృతి ఇస్తామని మాట ఇచ్చి దగా చేసింది. పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ చేసిన వాగ్దానాన్ని అటకెక్కించింది. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు ప్రభుత్వ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించింది. వలంటీర్లను ఇంటికి పంపేసింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటుతున్నా ఒక్కటంటే ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు నిరాశా నిస్పృహలో మునిగిపోయారు. పట్టభద్రులు ఊరికే ఇంటి వద్ద కూర్చోలేక ఉపాధి హామీ కూలీలుగా పనులకు వెళుతున్నారు. ఎన్నికల ముందు ఒకలా..అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించే సీఎం చంద్రబాబు నైజం మరోసారి బయటపడిందని విద్యార్థి, యువజన సంఘాలు మండిపడుతున్నాయి. కూటమి చేస్తున్న దగాపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం ''యువతపోరు'' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

సాక్షి ఫోకస్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేదింటి బిడ్డల అవస్థలు
- ఒక్క ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వకుండా యువతను మోసగించిన కూటమి
- నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను వంచించిన పాలకులు
- డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది బీఈడీ అభ్యర్థులు
- బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వలసలు
- ఉపాధి కూలీలుగా మారుతున్న పట్టభద్రులు
- చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామంటున్న యువత

హామీలతో వంచించి.. భవితను ముంచి..!

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు టౌన్:

జిల్లాలో డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర చదువులు చదువుకుంటున్న విద్యార్థులు సుమారు 47,423 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలేదు. దాంతో గత ఏడాదికి సంబంధించి రూ.110 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. కాలేజీ యాజమాన్యాలు మాత్రం ఫీజు రీయింబర్స్‌మెంటుతో మాకు సంబంధం లేదంటూ ముక్కుపిండి మరీ ఫీజులను వసూలు చేశారు. దాంతో వేలాది మంది విద్యార్థుల తలిదండ్రులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కొంతమందైతే చదువులు మానేసి పనులకు వెళ్లడం మొదలుపెట్టారు. ఇక రెండో ఏడాదైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తారేమో అని ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూశారు. కానీ రెండో ఏడాది కూడా చంద్రబాబు ప్రభుత్వం సాకులు చెప్పి మొండిచేయి చూపింది. దీంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి చేయడం మొదలు పెట్టాయి. నగరంలోని ఒక ఇంజినీరింగ్ కాలేజీలో ఫీజు చెల్లించలేదని ఒక విద్యార్థిని కాలేజీ బయట నిలబెట్టారు. బైపాస్ లో ఉన్న మరో డిగ్రీ కాలేజీ యాజమాన్యం ఫీజు కడితేనే పరీక్షలకు అనుమతిస్తాం, లేకుంటే లేదని బెదిరింపులకు దిగింది. హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను నానా తిప్పలు పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 2023-24 సంవత్సరానికి ఒక త్రైమాసికంలో మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించారు. మిగతా మూడు త్రైమాసికాలకు ఫీజులు చెల్లించలేదు. అలాగే 2024-25 విద్యాసంవత్సరానికి గాను మూడో సెమిస్టర్ గడుస్తున్నా నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదు. ఇప్పటి వరకూ జిల్లాకు సంబంధించి రూ.218 కోట్లు పెండింగులో ఉన్నాయి. రీయింబర్స్‌మెంట్ ఇస్తారో లేదో తెలియక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

నిరుద్యోగ భృతికి ఎగనామం:

లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని, లేకపోతే ఉద్యోగం వచ్చే వరకు ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన కూటమి నాయకులు అధికారం చేపట్టిన తరువాత ఆ మాటే మరిచిపోయారు. జిల్లాలో సుమారు 7.86 లక్షల యువకులు, 7.65 లక్షల మంది యువతులు ఉన్నారు. వీరిలో సుమారు 11 లక్షల మంది యువతీ యువకులు ఉద్యోగాలు లేక అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఉద్యోగాలు వచ్చే వరకు కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇస్తారేమో అని ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు నెలకు రూ.330 కోట్ల మేర నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ఏడాదికి రూ.3,960 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకూ చిల్లిగవ్వకూడా ఇవ్వలేదు. అటు ఉద్యోగాలు ఇవ్వకుండా, చేయడానికి ఎలాంటి పనులు చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ, పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ఎదురుచూపు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ఫైలు మీద తొలి సంతకం చేస్తామని చంద్రబాబు చెప్పిన మాట కూడా నీటి మూటలా మిగిలిపోయింది. జిల్లాలో బీఈడీ చేసిన సుమారు 8 వేల మంది అభ్యర్థులు డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇక కానిస్టేబుల్ పరీక్షలు రాసిన వారు 5 వేల మంది ఉన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మార్కాపురం, ఒంగోలు మెడికల్ కాలేజీలు, జీజీహెచ్ ఆస్పత్రుల్లో వివిధ విభాగాలకు సంబంధించి 290 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావడంతో అప్పుడు ఉద్యోగాల నియామకాలు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ నోటిఫికేషన్ రద్దు చేసింది. ఆ ఉద్యోగాల కోసం అప్పట్లో 15 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారి వద్ద నుంచి వసూలు చేసిన దరఖాస్తు ఫీజును వెనక్కి తిరిగి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జిల్లా సుమారు ఆరు వేల మందికి సచివాలయ వ్యవస్థ ద్వారా శాశ్వత ఉద్యోగాలు కల్పించింది. వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసి దాదాపు 12 వేల మందికి ఉపాధి కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీరు శాఖకు మంత్రిని నియమించింది కానీ ఆ వ్యవస్థకు మంగళం పాడడం గమనార్హం.

యువత వలసబాట

జిల్లాలో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది. ఇళ్లు గడవడం కష్టమైపోవడంతో ఏ పని దొరికితే ఆ పనికి వెళుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేయడానికి పనులు కూడా లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలుగా పనులకు వెళుతున్నారు. అక్కడ కూడా రాజకీయాలు ప్రవేశించడంతో చేసేదేమీ లేక భవన నిర్మాణ కార్మికులుగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వలసపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వివిధ పనులకు వెళుతున్న వారి సంఖ్య ఇలా ఉంది. ప్రైవేటు స్కూళ్లలో టీచర్లుగా, నాన్ టీచింగ్ పనులు చేస్తున్నవారు 7 వేలు, ప్రైవేటు కాలేజీలలో పనులు చేస్తున్న వారు 5 వేలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో కాంపౌండర్లుగా, నర్సులుగా పనులు చేస్తున్న వారు 10 వేలమంది, జుమాటో, స్విగ్గిలలో 3 వేల మంది, ఆటో డ్రైవర్లుగా 8 వేల మంది, పెట్రోలు బంకుల్లో బాయ్స్‌గా , అకౌంటెంట్లుగా 1500 మంది, షాపింగ్ మాల్స్‌లో సేల్స్ మెన్‌లు, సేల్స్ ఉమెన్లుగా 7 వేల మంది, చిన్న షాపింగ్ మాల్స్‌లో 5 వేల మంది, మెడికల్ రిప్రజెంటివ్స్ 500 మంది, కేటరింగ్ 3 వేల మంది, టెలీ కాలర్స్ 2 వేల మంది అసంఘటిత కార్మికులుగా పని చేస్తున్నారు. సుమారు 52 వేల మంది వచ్చే అరకొర వేతనాలతో బతుకుబండిని నెట్టుకొస్తున్నారు.

జిల్లాలో ఇలా..

డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు:	47,423
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు	రూ.218 కోట్లు
11 లక్షల మంది యువతకు నిరుద్యోగ భృతి నెలకు:	రూ.330 కోట్లు
సంవత్సరానికి:	రూ.3,960 కోట్లు
బీఈడీ అభ్యర్థులు:	8000 మంది
కానిస్టేబుల్ పరీక్షరాసిన వారు:	5000 మంది
ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నవారు:	23,448 మంది
ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న చిరుద్యోగులు:	52,000 మంది

ఉద్యోగం రాక కూలి పనులకు వెళ్తున్నాను



నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాలు రాక పొలం పనులకు వెళ్తున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితులు కనబడటం లేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలి.

– సుధా, అర్థవీడు మండలం

దివ్యాంగులకు సైతం మొండిచేయి...

జిల్లాలో వేలాది మంది దివ్యాంగులు చదువుకొని ఉద్యోగం కోసం వస్తుందన్న ఆశతో ఉన్నారు. వీరిలో కంటి చూపు లేని వారు 626 మంది, చెవిటి మూగ వారు 640 మంది, కాళ్లు చేతులు లేని వికలాంగులు 4,172 మంది ఉన్నారు. మొత్తం 5438 మంది దివ్యాంగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. వీరే కాకుండా 6,348 మంది మహిళలు, 7,184 మంది ఎస్సీలు, 1,511 మంది ఎస్టీలు, 6,620 మంది బీసీలు ఉన్నారు. నేటికి 23,448 మంది ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ చేసుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు.

నిరుద్యోగుల్లో భరోసా కల్పించాలి



నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చి నిరుద్యోగుల్లో భరోసా కల్పించాలి. నాడు ఎన్నికల సమయంలో ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు అండగా రూ.3 వేల భృతి ఇచ్చి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నేటికీ నిరుద్యోగ భృతి ఇవ్వకపోగా ఎలాంటి స్పష్టమైన ప్రకటన కూడాలేదు. దీంతో నిరుద్యోగ యువత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం భృతి ఇస్తే ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులకు ఎంతో చేయూతగా ఉంటుంది.

– జి.వంశి, పామూరు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నేను బీటెక్ మెకానికల్ పూర్తిచేశాను. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు ప్రతి నెలా నిరుద్యోగభృతి కింద రూ.3 వేల సాయం అందించి ఆదుకుంటానని మాట ఇచ్చారు. ఈమేరకు ఆయనకు అండగా నిలిచాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటుతోంది. ఇంతవరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. నాలాంటి చాలామంది నిరుద్యోగ యువత భృతి కోసం ఎదురుచూస్తున్నారు.

– కే.శ్రీమన్నారాయణ, పామూరు

నిరుద్యోగ భృతి లేదు..ఉద్యోగాలు లేవు



అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పడంతో అందరమూ నమ్మాం. దీనితో పాటు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 9 నెలలైనా అటు నిరుద్యోగ భృతి లేదు, ఇటు కొత్త ఉద్యోగాల నోటిఫికేషన్ లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఉద్యోగాలకు కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నాం.

– టి.మహేష్‌కుమార్, బీటెక్, మార్కాపురం

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇచ్చారు. నేను 2021లో డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాను. నాలాంటి నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తానంది. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నెలా నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలలైనా ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్ కానీ, నిరుద్యోగ భృతి కానీ ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

– కె.మధుసూదన్‌రావు, కొండపి

ఉద్యోగావకాశాలు కల్పించాలి



నేను డిగ్రీ చదివి, వెటర్నరీ కోర్సుపూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో గతంలో పెయింటర్‌గా పనిచేశాను. ప్రస్తుతం డ్రైవర్‌గా వెళ్తున్నాను. నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తే ఎంతో ఉపయోకరంగా ఉంటుంది.

– డి.ఖాదర్‌బాష, కంభం

న్యూస్‌రీల్

తొలగించిన భూముల పునఃపరిశీలన చేపట్టాలి

- సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి

ఒంగోలు సిటీ: నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పునఃపరిశీలన పటిష్టంగా చేపట్టాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. అమరావతి నుంచి సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ, నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. ఒంగోలు కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌష్ బాషా, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి బిడ్డలకు మేలు చేసే కంగారు కేర్ సెంటర్లు



జీజీహెచ్‌ను సందర్శించిన సీఈబీ సభ్యులు

ఒంగోలు టౌన్: తల్లీ బిడ్డల ఆరోగ్యానికి కంగారు మదర్ కేర్ సెంటర్లు ఎంతో మేలు చేస్తాయని కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ చీఫ్ ఆఫీసర్ ట్రాయ్ చున్నిగం అన్నారు. మంగళవారం ఆయన సీఈబీ టీం సభ్యులతో కలిసి జీజీహెచ్‌లోని గైనికాలజీ, పీడియాట్రిక్, ఎస్ఎన్‌సీయూ, ప్రతిపాదిత కంగారు మదర్ కేర్ సెంటర్లను పరిశీలించారు. తొలుత సీఈబీ టీం సభ్యులు రీసెర్చ్ డైరక్టర్ వివేక్ సింగ్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావ్యలు సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వివిధ విభాగాలకు చెందిన వైద్యులతో చర్చించారు. సీఈబీ పూర్తి స్థాయిలో సాంకేతిక సాయాన్ని అందజేస్తుందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీజీహెచ్‌లో అన్నీ రకాల సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ జమున టీం సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కిరణ్, డీసీహెచ్ఎస్ డా.సూరిబాబు, మదర్ కేర్ నోడల్ అధికారి డా.వేణుగోపాల్ రెడ్డి, హెచ్ఓడీలు సంధ్యారాణి, శివరామకృష్ణ, డా.తిరుమలరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శనగలు, మినుములు కొనుగోలుకు అనుమతులు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సిటీ: శనగలు, మినుముల పంట ఉత్పత్తులను నాఫెడ్ ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి శనగలు కనీస మద్దతు ధర రూ.5650, మినుములు కనీస మద్దతు ధర రూ.7400 లకు కొనుగోలు చేసేందుకు అనుమతులు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 23,023 మంది రైతులు 24,600 హెక్టార్లలో శనగల పంట సాగు చేసుకున్నట్లు ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్నారు. దీనికి గాను 60,826 మెట్రిక్ టన్నుల పంట వస్తుందని వ్యవసాయ శాఖ ద్వారా అంచనా వేశారు. మినుములు 11,200 హెక్టార్లలో 12,540 మంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్నారు. దీనికి గాను 14,489 మెట్రిక్ టన్నుల పంట వస్తుందని అంచనా వేశారు. రబీ 2024-25 లో శనగ, మినుముల పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకున్న రైతుల వద్దనుంచి పంట కొనుగోలు చేస్తారన్నారు. రైతులు ఈనెల 13వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు, పంట నూర్పిడి తేదీని నమోదు చేయించుకోవాలని చెప్పారు. రైతు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ద్వారా అమ్ముకోవాలని సూచించారు. తమ సరుకును అమ్ముకొనే తేదీ రిజిస్టర్ మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుందని, రైతులకు తమ డబ్బులు ఆధార్ తో అనుసంధానం అయిన బ్యాంకు అకౌంట్ లో జమ చేస్తారన్నారు. రైతులు తమ సరుకును అమ్మే సమయంలో తమ మొబైల్ నంబరు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ కు లింక్ అందో లేదో సరి చూసుకోవాలని తెలిపారు. రైతులు తమ పంటను శుభ్రపరుచుకొని, ఆరబెట్టుకొని శనగలు తేమ శాతం 14 శాతంలోపు, మినుములు తేమ 12 శాతం లోపు ఉండి ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాల్లో ఉండేలా చూసుకోవాలన్నారు.

'యువత పోరు'ను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ, నాయకులు,కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి (కురిచేడు): ఒంగోలులో బుధవారం జరిగే యువతపోరును జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి కార్యకర్తలు, నాయకుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు ప్రభుత్వం ఇవ్వకపోవటంతో అనేక మంది కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యా దీవెన, వసతి దీవెన కింద ఏటా స్కాలర్ షిప్‌లు అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంత వరకు ఎటువంటి ఫీజులు చెల్లించలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 9 నెలలు అయినా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా నిరుద్యోగ భృతి చెల్లించలేదని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల కృష్ణారెడ్డి, యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, చింతా శ్రీనివాసరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, ఇత్తడిదేవదానం, జెడ్పీటీసీలు రత్నరాజు, నుసుం వెంకట నాగిరెడ్డి, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి మేడికొండ జయంతి, జిల్లా యూత్ అధ్యక్షుడు జీ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు యం దేవప్రసాద్, జిల్లా జనరల్ సెక్రటరీ సూదిదేవర అంజయ్య, ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, దర్శి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి, బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఉదయం గం.9.30కు వేడుకలు నిర్వహించనున్నట్లు ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం నెల్లూరు బస్టాండ్ వద్ద డి.ఆర్.ఆర్ మున్సిపల్ స్కూల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థి నాయకులతో కలిసి ×యువత పోరు¤ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కే నాగార్జున రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ కార్యకర్తలా ఏపీఎం!



నిరసన తెలుపుతున్న కృపమ్మ

- కోర్టు ఆదేశాలు బేఖాతరు
- వీఓఏలపై వైఎస్సార్ సీపీ ముద్రవేసి తొలగింపు
- కార్యాలయాన్ని ముట్టడించిన బాధితులు

ముండ్లమూరు(కురిచేడు): కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత చిరుద్యోగులపై వేధింపులు మొదలయ్యాయి. ఎలాంటి తప్పులు లేకపోయినా కూటమి నాయకులు కక్షగట్టి మరీ తప్పిస్తున్నారు. మండలంలో వీఓఏల పై ఏపీఎం హనుమంతరావు ఒక టీడీపీ కార్యకర్తలా ప్రవర్తిస్తూ వేధిస్తున్నారని చిరుద్యోగులు వాపోతున్నారు. టీడీపీ ముఖ్యనేతల నుంచి తనపై ఒత్తిళ్లు ఉన్నాయని, ఉద్యోగాల నుంచి వైదొలగాలని వీఓఏలను బలవంతం చేయటంతో కొందరు తప్పుకున్నారు. మరికొందరు కోర్టును ఆశ్రయించారు. తాజాగా మండలంలోని చిన్న ఉల్లగల్లు గ్రామ సంఘం వీఓఏగా పనిచేస్తున్న తప్పెట కృపమ్మను ఏపీఎం హనుమంతరావు, సీసీ రత్నకుమారి విధులు నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని వారిపై కృపమ్మ హైకోర్టులో కేసు వేశారు. ఆమె విధులకు ఆటంకం కలిగించకూడదని కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. అయినా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఆన్‌లైన్ నుంచి తన పేరును తొలగించినట్లు కృపమ్మ తెలిపింది. ఆమేరకు మంగళవారం వెలుగు కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది.

ప్రభుత్వం మారిందని నన్ను తొలగించారు

ప్రభుత్వం మారిందని, టీడీపీ నాయకుల ఒత్తిళ్లు తనపై ఉన్నాయని నన్ను ఏపీఎం హనుమంతరావు, సీసీ రత్నకుమారి మానుకోవాలని నిత్యం ఒత్తిడి చేస్తున్నారు. వారి ఒత్తిడి తట్టుకోలేక హైకోర్టులో వారిపై కేసు వేసి ఇంజక్షను ఆర్డర్ తెచ్చుకున్నాను. అయినా కూడా రూ.20 వేలు ఇవ్వాలని, ఇస్తే ఉంచుతానని ఏపీఎం డిమాండ్ చేశారు. అవి ఇచ్చేందుకు నావద్ద లేవని చెప్పటంతో నాపేరు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. కోర్టు ఆర్డరు తెచ్చుకున్నా మీరు ఉద్యోగం ఎలా చేస్తారో చూస్తానంటూ బెదిరిస్తున్నారు. కోర్టు ధిక్కారం కింద ఏపీఎం, సీసీపై కేసు నమోదు చేసి నాకు న్యాయం చేయండి.

– తప్పెట కృపమ్మ, వీఓఏ

మేము తొలగించలేదు

కృపమ్మను ఉద్యోగం నుంచి తొలగించలేదు. 10వ తేదీ వరకు విధులు నిర్వహించింది. కోర్టు ఇంజక్షను ఆర్డర్ తెచ్చినా మేము ఏమీ అనలేదు. ఆ తరువాత కోర్టు ధిక్కరణ కింద మాపై మళ్లీ కోర్టుకి వెళ్లింది. అందువలన ఆమె లాగిన్ ఆన్‌లైన్‌లో ఇన్ యాక్టివ్ చేశాం.

– ఏపీఎం హనుమంతరావు

క్లుప్తంగా

యువత పోరుకు తరలిరావాలి

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రం ఒంగోలులో నిర్వహించనున్న యువత పోరుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఇవ్వాల్సిన 3 త్రైమాసిక రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం పెట్టారని విమర్శించారు. రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే కళాశాలల్లో విద్యార్థులకు ఏ విధంగా చదువులు చెప్పగలుగుతారని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా యువత పోరులో పాల్గొనాలని, యువతతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మెల్యే తాటిపర్తి కోరారు.

కంభంలో చైన్ స్నాచింగ్

కంభం: నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించిన సంఘటన మంగళవారం కంభంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న కదం హుస్సేనమ్మ అనే మహిళ చర్చి నుంచి ఇంటికి వెళ్తోంది. స్థానిక కల్కిభగవాన్ వీధి వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని గొలుసును లాక్కుని పరారయ్యాడు. సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉండటంతో సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో దొంగను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గడిచిన వారం రోజుల్లో ఇది రెండో చైన్ స్నాచింగ్ కాగా రెండు దొంగతనాలు చేసింది ఇతనేనా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

సేవల్లేక జనం విలవిల.. ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాల!

● సచివాలయాల సేవలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
● కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుపై ఉద్యోగులను ప్రశ్నిస్తున్న జనం
● కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలైనా తెరుచుకోని వెబ్‌సైట్లు
● సర్వేల పేరుతో ఉద్యోగులను ఇంటింటికీ తరుముతున్న ప్రభుత్వం
● గతంలో వలంటీర్లతో సర్వే చేయించడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు అండ్ కో



కొమరోలులోని గ్రామ సచివాలయం

బేస్తవారిపేట:

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారింది. సుమారు 554 రకాల సేవలు అందిస్తున్న గ్రామ/వార్డు సచివాలయాలను కూటమి ప్రభుత్వం క్రమంగా దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్న తీరు అటు ప్రజల్లోనే కాకుండా ఇటు ఉద్యోగుల్లోనూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను ఎలాంటి పక్షపాతం, అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ అందజేయుడమే లక్ష్యంగా 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1058 గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు కాగా జిల్లాల విభజన అనంతరం ప్రకాశంలో ప్రస్తుతం 716 సచివాలయాలున్నాయి. మొత్తం 5 వేల మందికి పైగా ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వీటిలో మూడొంతులకు పైగా భవనాలను ప్రభుత్వం సొంత నిధులు వెచ్చించి నిర్మించింది. ఒక్కో సచివాలయాన్ని రూ.45 లక్షలతో అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ సంక్షేమ పథకం అమలు చేసినా సచివాలయ ఉద్యోగులతో పాటు వలంటీర్ల ద్వారా అందరికీ తెలియజేసి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

తొమ్మిది నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే సచివాలయాల్లో సేవలకు గ్రహణం పట్టింది. సేవలను పూర్తిగా నీరుగార్చడంతో ప్రజలు తమ సమస్యలపై పాలోమంటూ మండల కేంద్రాల్లో అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడా పరిష్కారం కాకుంటే వ్యయ ప్రయాసలకోర్చి ఆర్డీఓలు, జిల్లా కేంద్రానికి వెళ్లి తమ బాధలు చెప్పుకొని వినతి పత్రాలు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య నిర్వహించే స్పందన కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలకడమే ఈ దుస్థితికి కారణం. ప్రస్తుతానికి జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేయకపోయినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అనధికారికంగా కూటమి నాయకులే చూస్తుండటంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాల్లో టీడీపీ, జనసేన నాయకుల మితిమీరిన జోక్యం కారణంగా అర్హులైన వారు అన్యాయానికి గురవుతుండగా.. కూటమి కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూరుతోంది. ఉపాధి హామీ నిధులతో సబ్సిడీపై అందించే పశుగ్రాసం యూనిట్లు, గోకులం షెడ్ల నిర్మాణం, బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ రుణాల మంజూరు.. ఇలా ప్రతి పథకంలో నేరుగా కూటమి సానుభూతిపరునే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలాంటి పథకాలన్నీ సచివాలయాల ద్వారా పారదర్శకంగా జరిగేవని గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, బర్త్, డెత్ తదితర ధ్రువీకరణ పత్రాలకు సచివాయాల్లో దరఖాస్తు చేసుకున్నా మండల కేంద్రాల్లో అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని, లేదంటే ఆలస్యంగా ధ్రువీకరిస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మా రేషన్ కార్డు.. అయ్యా పింఛనెప్పుడు ?



ఇంటింటి సర్వే, పింఛన్ల పంపిణీ సమయంలో ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు సచివాలయ ఉద్యోగుల వద్ద సమాధానం ఉండటం లేదు. 'కొత్త పింఛన్లు రాస్తున్నారా అయ్యా.. రేషన్ కార్డు కోసం అప్లికేషన్ తీసుకుంటున్నారా అమ్మా..' అంటూ ఆశగా అడుగుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు 'లేదు.. లేదు.. గవర్నమెంట్ ఇంకా సైటు వదల్లేదు' అని చెప్పి ముందుకు కదులుతున్న పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడిచినా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆధారమైన రేషన్‌కార్డుల మంజూరులో ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. సచివాలయాల్లో దరఖాస్తులు పెట్టుకుని నెలలు గడుస్తున్నా కొత్త కార్డులు మంజూరు చేయకపోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా స్వీకరించకపోవడం ప్రభుత్వ పాలన తీరును తేటతెల్లం చేస్తోంది.

'సర్వే'శ్వరా..

గత ప్రభుత్వంలో వలంటీర్లతో సర్వేలు చేయించడాన్ని తప్పుబట్టిన అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు.. తాను అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. ఏకంగా సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరుతో నిరంతరం తరుముతున్నారు. మొత్తం 15 రకాల ఇంటింటి సర్వేలతో సచివాలయాల ఉద్యోగులు కుస్తీలు పడుతున్నారు. 'సర్వే చేస్తున్నాం.. ఓటీపీ చెప్పండి' అని అడిగితే జనం చీదరించుకుంటున్నారని, తమకు కనీస గౌరవం లేకుండా పోతోందని ఉద్యోగులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. సెలవు రోజులతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని చెప్పడం, సర్వే పేరుతో టార్గెట్లు పెట్టడం, మరో వైపు మాతృశాఖ పనులు, బీఎల్ఓ విధులు ఇలా అన్ని రకాల పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి వరుసగా వస్తున్న ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. పని ఒత్తిడి తగ్గించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. సర్వేల పేరుతో ఇతర శాఖల అధికారులు వేధిస్తున్నారని, పరిస్థితి మారకుంటే ధర్నా చేస్తామంటూ ఏఎన్ఎంలు రెండు రోజుల క్రితం ప్రభుత్వానికి నోటీసులివ్వగా మిగిలిన శాఖల ఉద్యోగులు సైతం ఇదే బాటను అనుసరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.



అంగన్‌వాడీ టీచర్‌ది ఆత్మహత్య కాదు.. కూటమి నేతల హత్య..!

ఒంగోలు టౌన్: గుంటూరు జిల్లా నకరికల్లు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ షేక్ ఫాతిమా బేగంను ఆత్మహత్యకు పురిగొల్పిన కూటమి నాయకులపై హత్య కేసు నమోదు చేయాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ సత్తార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన నాయకుల బెదిరింపులకు తాళలేకనే ఫాతిమా ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. 11 ఏళ్లుగా టీచర్‌గా పనిచేస్తున్న ఆమెను ఉద్యోగం నుంచి తొలగించేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేయడం, 9 నెలలుగా ఆమెను బెదిరిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఆమె చనిపోయిందన్నారు. చనిపోయిన మనిషిని ఎలాగూ తీసుకొని రాలేరని, కనీసం ఆమె చావుకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఫాతిమాకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, వారి పేరు మీద 50 లక్షల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని, ఆమె భర్తకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగు దేశం, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సింగరాయకొండ: మండలంలోని కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్ల గ్రామ జామాయిల్ తోటలో గుర్తు తెలియని వ్యక్తి(55) మద్యంలో గుళికలు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మిస్సింగ్ అయిన వ్యక్తుల సంబంధీకులు 9121102135, 9121102136ను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యువత పోరును జయప్రదం చేయాలి

● మాజీ మంత్రి సురేష్ పిలుపు


యువత పోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తయినా సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద విద్యార్థుల కోసం జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేసి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చి యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. వైఎస్సార్ ఉన్నతాశయంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని తప్పుబట్టారు. బుధవారం జిల్లా కేంద్రం ఒంగోలులో చేపట్టే యువత పోరు కార్యక్రమానికి యువత, వారి తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తల్లికి వందనానికి అరకొర నిధులా?

తల్లికి వందనం పథకానికి సంబంధించి రాష్ట్రంలో 1.20 కోట్ల మంది తల్లులు ఉంటే ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల ప్రకారం సుమారు 15 వేల కోట్లు అవసరమైతే బడ్జెట్‌లో కేవలం 9 వేల కోట్లు మాత్రమే ప్రకటించారని మండిపడ్డారు. ప్రస్తుతం నూతన విధానం ప్రకారం 10 రోజుల పాటు విద్యార్థి ఎటువంటి కారణం లేకుండా పాఠశాలకు రాకపోతే అతని పేరు తొలగించాలని ఆదేశాలు ఇచ్చారని ఆ ప్రకారం జిల్లాలో 45 వేల మంది విద్యార్థుల పేర్లు తొలగించారని ఆదిమూలపు సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికి కూటమి ప్రభుత్వం రెండు బడ్జెట్‌లు ప్రవేశ పెట్టినప్పటికీ నిరుద్యోగులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు.

మెడికల్ కాలేజీలపై నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డాక్టర్ కావాలన్న పేద పిల్లల కలలను నిజం చేసేందుకు 17 మెడికల్ కాలేజీలు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక కేవలం 11 మెడికల్ కాలేజీలు మామే నిర్మించారని గుర్తు చేశారు. ఈ కాలేజీల ద్వారా 2,500 మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మార్కాపురం, ఆదోని, పులివెందులలో మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తే ఇంకా పనులు ఉన్నాయని వాటిని గాలికి వదిలేసి పేద విద్యార్థులు డాక్టర్ కోర్సు చదవకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పనిచేయవద్దని, వారికి పనిచేస్తే పాముకు పాలు పోసినట్లేనని సాక్షాత్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగంగా చెప్పడంపై మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పేరుతో ఆరాచక పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. ఎప్పుడో ఏదో అన్నారని పార్టీ కార్యకర్తలతో కేసులు పెట్టించి కోర్టు ముందు హాజరుపరచకుండా వైఎస్సార్ సీపీ మద్దతుదారులను ఇబ్బందులకు గురి చేయడాన్ని ఆక్షేపించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్‌ను హోం మంత్రి అనిత చెత్త యాప్ అంటున్నారంటే మహిళలపై ఆమెకు ఉన్న గౌరవం అర్థమవుతోందన్నారు. అనంతరం యువత పోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ ఇంటలెక్చువల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కట్టా శోభారాణి, బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ బొట్లా రామారావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మాకినేని వెంకట్రావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు పుట్టా వెంకట్రావు, జిల్లా ఆర్గనైజేషన్ మెంబరు కట్టా ఆనంద్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారంరెడ్డి గంగాధర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పరిటాల సునీల్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వసంతరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు యనమల మాధవి, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, పంచాయతీరాజ్ విభాగం షేక్ వన్నూరు, సోషల్ విభాగం అధ్యక్షుడు వేమిరెడ్డి పెద్దిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలీం, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కొమ్ము ప్రభుదాస్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గాదంశెట్టి గుప్తా, జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న చైర్మన్ గఫార్, సయ్యద్ యాసీన్

కనిగిరిరూరల్: పట్టణంలోని ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఇఫ్తార్ విందులో మేము సైతం అంటూ కార్మికులు భాగస్వాములయ్యారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ దువా, విందులో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సయ్యద్ యాసీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మతసామరస్యతకు ప్రతీకగా.. సోదర, స్నేహ భావాన్ని పెంపొందించే విధంగా ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడాన్ని కొనియాడారు. సీపీఐ కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ లౌకిక విలువలు కాపాడుతూ.. ప్రజల్లో ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందించే విధంగా కర్షక వర్గాలు చేపట్టిన బృహత్తర కార్యక్రమంగా కొనియాడారు. అనంతరం ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాది సుమైర్, నజీర్‌బాషా, ఎస్‌కే సందాని, ఫయాజ్, గండికోట రవి, ఎస్‌కే వలి, బాషా, నాయబా, అసోసియేషన్ నాయకులు, మదర్ థెరిసా సేవా సమితి అధ్యక్షుడు ఎస్ ఎన్ రసూల్, మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జిల్లా పోలీసులు



జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జాతీయ స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పోలీసులు సత్తా చాటారు. ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో 45వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా పోలీసు శాఖ నుంచి 30 ప్లస్ ఏజ్ గ్రూప్ విభాగంలో పోలీసులు సత్తా చాటారు. ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సురేష్ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో రెండు సిల్వర్, 4×100 మీ, 4×400 మీటర్ల రిలే పోటీల్లో రెండు బ్రాంజ్ పతకాలను సాధించారు. పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాసరావు 4×100, 4×400 మీటర్ల పోటీల్లో రెండు బ్రాంజ్ పతకాలను సాధించారు. పోటీల్లో ప్రతిభ చాటిన ఆర్ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ శ్రీనివాసరావులను మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని వృథా చేయవద్దు

● ప్రస్తుతం చెరువుల్లో నీటిని సర్దుబాటు చేసుకోవాలి
● జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ వరలక్ష్మి

ఒంగోలు సబర్బన్: ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ ఈ.వరలక్ష్మి తెలిపారు. ఫిబ్రవరి 24, 27వ తేదీల్లో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సాగర్ కుడి కాలువకు సంబంధించిన నీటి కేటాయింపుల్లో మిగిలి ఉన్న నీరు ఈ నెల చివరి వారం వరకు మాత్రమే సరిపోతుందని, ఈ కొద్దిపాటి నీటిని ఏ మాత్రం వృథా చేయకుండా పంట పొలాలకు, తాగు నీటి చెరువులు నింపేందుకు వినియోగించాలని సూచించారు. సాగర్ కుడి కాలువ పరిధిలో తాగు నీటి చెరువులకు మేలో నీరు విడదల చేసే వరకు కాలువలు మూసి ఉంచుతారని పేర్కొన్నారు. కనుక పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ప్రజారోగ్య విభాగాల అధికారులు తాగునీటి చెరువుల్లో నీటిని జాగ్రత్తగా వినియోగించాలని కోరారు.

కురిచేడు ఎంఈఓ-2పై డీవైఈఓ విచారణ

కురిచేడు: మండల విద్యాశాఖాధికారి-2పై యూటీఎఫ్ నాయకుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయన మంగళవారం విచారణ చేపట్టారు. తొలుత ఎంఈఓ-2 సీహెచ్ సుబ్బారావును విచారించారు. కిట్ల పంపిణీకి వచ్చిన నగదు, నాడు-నేడు బిల్లుల వినియోగం, మెగా పేరంట్స్ డేకు సంబంధించి నిధులు దుర్వినియోగానికి సంబంధించి బిల్లులు చూపించాలని ఎంఈఓను డిప్యూటీ డీఈఓ ఆదేశించారు. అనంతరం యూటీఎఫ్ నాయకులు, ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులను విచారించి రుజువులు చూపాలని కోరారు. మండలానికి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు సేకరించారు. ఎమ్మార్సీ గ్రాంట్ ఎంత వచ్చింది, దేనికి ఎంత ఖర్చయింది.. వంటి వివరాలు ఇవ్వాలని ఎంఈఓ-1 వస్త్రాంనాయక్‌ను డిప్యూటీ డీఈఓ ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా జరుగుతాయని, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షలకు సంబంధించి సిబ్బంది నియామకపు ఆర్డర్లు ఇవ్వటం పూర్తయిందన్నారు. విచారణకు సంబంధించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు తెలిపారు.

క్లుప్తంగా

నేడు చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం చీమకుర్తిలో నిర్వహిస్తున్నట్లు పార్టీ చీమకుర్తి పట్టణ అధ్యక్షులు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బూచేపల్లి కల్యాణ మండపం నుంచి పోలీసు స్టేషన్ వద్ద నున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం ఒంగోలులో జరిగే యువత పోరు కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మండలాలలో ఉన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, పార్టీలోని వివిధ శ్రేణులు, కార్యకర్తలు భారీగా రావాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి


ఉపాధిహామీ కూలీల సమస్యలు తెలుసుకున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి రూరల్: మహాత్మగాంధీ ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని, ఏడాదికి 200 పనిదినాలు పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పూసపాటి వెంకటరావు డిమాండ్ చేశారు. మంగళవారం కేవీ పాలెం, మువ్వారిపాలెంలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే వ్యవసాయ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేస్తానన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు ఊసే తేలేదని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పులి ఓబులరెడ్డి, నల్లూరి కృష్ణయ్య, కొల్లూరి అక్కయ్య, బ్రహ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక శక్తి సామర్థ్యాలు పెంచుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఐపీఎస్ జి.ఆర్.రాధిక

ఒంగోలు సిటీ: విద్యార్థులు జీవన నైపుణ్యాలు, మానసిక శక్తి సామర్థ్యాలు పెంచుకోవాలని ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఐపీఎస్ జి.ఆర్. రాధిక అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో రోల్ మోడల్ ఉపన్యాసానికి ముఖ్య వక్త, అతిథిగా ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఆర్.రాధిక మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక్క లక్ష్యం పెట్టుకొని ఆ లక్ష్యం చేరే దాకా నిరంతరం ఏకాగ్రతతో చదవాలన్నారు. ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్, మంచి ప్రవర్తన ఎలా ఉండాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు వి.కె.గీతలక్ష్మి విద్యాలయ ప్రగతిని వివరించారు. యోగ, బాక్సింగ్ లలో ఎస్.జి.ఎఫ్ దాకా వెళ్లిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవోదయ ఉప ప్రిన్సిపాల్ సి. శివరాం, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తది ఇచ్చేదెన్నడు.. తీసుకునేదెప్పుడు !

జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రులు ఊదరగొట్టారు. దీనికి తోడు పచ్చ మీడియా సైతం బాకా ఊది మరీ ప్రచురించారు. తీర చూసే సరికి జనవరి పాయే, ఫిబ్రవరి కూడా పోయే. చివరికి మార్చిలోకి కూడా వచ్చాం. ఇంతవరకూ రైషన్ కార్డుకు సంబంధించిన సమాచారం లేదు. దీంతో అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట.. వచ్చాక మరోమాటతో ప్రజలను మభ్యపెడుతూ పేద ప్రజల జీవితాలను ఆడుకుంటోంది కూటమి ప్రభుత్వం..



- కొత్త రేషన్ కార్డులు ఎప్పుడో?
- ఎస్ఎన్‌పాడులో 1000కి పైగా కొత్త దరఖాస్తుదారులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు అంటూ ప్రభుత్వం హడావుడి
- గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఇంకా ఉత్తర్వులు రాలేదంటున్న అధికారులు

సంతనూతలపాడు: కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో అని అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల కోసం రోజూ గ్రామ సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా కొత్త రేషన్ కార్డుల మంజూరుపై ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. సంతనూతలపాడు మండలంలో వందల సంఖ్యలో పేద ప్రజలు నూతన రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం జరిగేది. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులతో పాటు కొత్తగా పెళ్లైన వారికి రేషన్ కార్డులు ఇచ్చింది. ఇప్పటి వరకూ కుటుంబానికి ఉన్న వారిని రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించేందుకు స్ప్లిట్ ఆప్షన్ కూడా లేక పోవడం, పేర్లు మార్పు, చేర్పులను చేపట్టక పోవడం, కొత్తగా పెళ్లై పుట్టింటి నుంచి అత్తగారింటికి వెళ్లిన కొత్త కోడలికి రేషన్ కార్డు దక్కని పరిస్థితి. వివాహమై ఇంటి పేరు మారినా రేషన్ కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేయక పోవడంతో సబ్సిడీ బియ్యం అందక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకుపోతున్న దరఖాస్తులు..

మండంలో ప్రస్తుతం 646అంత్యోదయ కార్డులు, తెల్లరేషన్ కార్డులు 14161 ఉన్నాయి. గతంలో కొత్తగా పెళ్లైన వారు తల్లిదండ్రులు కార్డుల నుంచి తమ పేర్లు తొలగించాలని దరఖాస్తు చేసుకుంటే స్ప్లిట్ ఆప్షన్ ద్వారా సచివాలయ సిబ్బంది వెంటనే వారి పేర్లను కార్డుల నుంచి తొలగించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డు వెబ్ సైట్ పని చేయకపోవడంతో కొత్త జంట నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు రేషన్ కార్డులు మంజూరు చేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామ సచివాలయ సిబ్బందిని అడిగితే ఆప్షన్ రాలేదని సమాధానం చెప్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా 1000 మంది నూతన రేషన్ కార్డులు దరఖాస్తు కోసం ఎదురు చూస్తున్నారు. పైగా కొత్తగా ప్రభుత్వం పీ–4 సర్వే చేయనుండటంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యం కానుందని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

> **కార్డు కోసం ఎదురు చూస్తున్నాం**
> నాకు వివాహమైనప్పటి నుంచి రేషన్ కార్డు కోసం ఆశగా ఎదురు చూస్తున్నా. గ్రామ సచివాలయం వద్దకు పలుమార్లు తిరిగినా వెబ్ సైట్ ఓపెన్ కాలేదని సిబ్బంది చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తోంది. ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి.
> – శీలం అయ్యప్పరెడ్డి, సంతనూతలపాడు

> **ఉత్తర్వులు రావాల్సి ఉంది..**
> నూతన రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం. అంతవరకు ప్రజలు ఎవరూ కార్యాలయాలు చుట్టూ తిరగవద్దు. వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే మార్పులు, చేర్పులు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
> – ఎన్. మాబు సుభాని, డిప్యూటీ తహసీల్దార్, సంతనూతలపాడు

మానసిక ఒత్తిడి జయించేందుకు క్రీడలు దోహదం


పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ మూర్తి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు

ఒంగోలు సిటీ: ప్రతి వ్యక్తిలో అంతర్గతంగా ఉండే మానసిక ఒత్తిడిని జయించేందుకు కృషి చేసేవి క్రీడలు మాత్రమే అని, క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఐకమత్యం పెంపొందుతుందని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో ఇంటర్ పెడగాగి (పాఠశాల స్థాయి) పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 7 పాఠశాలలకు చెందిన 210 మంది క్రీడాకారులు పాల్గొనగా వారికి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు, విద్యార్థులు సహకరించారు. ఆటల్లో పాల్గొన్న క్రీడాకారులను ఉద్దేశించి వైస్ ఛాన్సలర్ పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా వి.సి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి స్థానిక ఏ.కే.యూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్ రావు, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీ వర ప్రసాద్ తదితరులతో కలిసి ఆయన క్రీడా ఫ్లాగ్ లను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు క్రీడల్లో జరిగిన పోటీల్లో విజేతల వివరాలను ఏకేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీ వర ప్రసాద్ ప్రకటించారు. హ్యాండ్ బాల్ పోటీల్లో మొదటి బహుమతిని నెక్స్ట్‌జెన్ స్కూల్ విద్యార్థులు, రెండో బహుమతిని గౌతమ్ స్కూల్ విద్యార్థులు సాధించారు. కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంతనూతలపాడు విద్యార్థులు, రెండో బహుమతిని డి.ఆర్.ఆర్.ఎం స్కూల్ విద్యార్థులు సాధించారు. ఖో- ఖో పోటీల్లో మొదటి బహుమతిని నారాయణ స్కూల్ విద్యార్థులు, రెండో బహుమతిని డి.ఆర్.ఆర్.ఎం స్కూల్ విద్యార్థులు పొందారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతిని డి.ఆర్.ఆర్.ఎం స్కూల్ విద్యార్థులు, రెండో బహుమతిని నారాయణ స్కూల్ విద్యార్థులు పొందారు. సాయంత్రం 6 గంటల సమయంలో యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమ శేఖర అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు మాట్లాడుతూ ఆటల పోటీల నిర్వహణ విషయంలో కొంత కాలంగా ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అన్ని విధాలా ముందు వరుసలో ఉందన్నారు. విజేతలైన క్రీడాకారులకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, డి.ఓ.ఏ ప్రొఫెసర్ సోమ శేఖర, ఏ.కే.యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీ వర ప్రసాద్, రిమ్స్ వైద్యశాల డెంటల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.హెచ్ హిమ శిల్ప, ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పి.డి గంటా సాయి సురేష్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగం ఇన్చార్జి డాక్టర్ ఆర్. శ్రీనివాస్, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో బాటు ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి చెందిన ఎం.పి.ఎడ్, బి.పి.ఎడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో తాగునీటికి కటకట


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: గ్రామంలో తాగడానికి మంచి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండలంలోని పీ తక్కెళ్లపాడు గ్రామ ఎస్సీ కాలనీవాసులు అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని తక్కెళ్లపాడులో మంగళవారం రాత్రి ప్రజా చైతన్య యాత్ర బృందం కాలనీ వాసులను కలిసి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగడానికి మంచి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలో అక్కడక్కడా ఉన్న పంచాయతీ నీటి కుళాయిలు కూడా పనిచేయడం లేదని వారు బృందం దృష్టికి తెచ్చారు. తమ కాలనీలో రోడ్లు సైడు కాలువలు లేవని వారు తెలిపారు. మురుగు కాలవల్లేక మురుగు నీరు ఎక్కడి దక్కడే నిలిచిపోయి దోమలు విపరీతంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం తమ సమస్యల గురించి పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రజా చైతన్య యాత్ర బృందంలో సీపీఎం మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, యు సీతారామరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయాలి


దుంపా చెంచిరెడ్డి

సంతనూతలపాడు: విద్యార్థులకు, నిరుద్యోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ దుంపాచెంచిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, యువతకు ఉద్యోగ కల్పన లేకుండా మోసగిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నేడు చేపట్టిన 'యువత పోరు' ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు హయాంలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. యువతకు లక్షలాది ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఉద్యోగం లేని యువకు లకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసపూరితమైన వాగ్దానాలు చేశారని, పదవి వచ్చిన తర్వాత ఆ హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి వసతి దీవెనకు సంబంధించి రూ.4600 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే అందులో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభమైన దశలో మొత్తం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి చంద్రబాబు ఎత్తులు వేస్తున్నారని అన్నారు. ఈ సమస్యలపై నేడు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మెమొరాండం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి


కనపర్తిలో రైతుల సమస్యలు వింటున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు: వరికి సరైన మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు జిల్లా కార్యదర్శి ఎస్కకే మాబు డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలు తెలుసుకొనేందుకు సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర మంగళవారం మండలంలోని వినోదరాయునిపాలెంలో సాగింది. ఈసందర్భంగా రైతులు వారు పడే కష్టాలను బృందం ఎదుట వినిపించారు. మండలంలో కనపర్తి ఎత్తిపోతల పథకం కింద అమ్మనబ్రోలు, కనపర్తి, దాసరివారిపాలెం, వినోదరాయునిపాలెం, మాచవరం, రాపర్ల, చవటపాలెం, తదితర గ్రామాలకు సంబంధించి సుమారు 4 వేల ఎకరాల్లో వరి సాగుచేశారన్నారు. అదేవిధంగా తిమ్మసముద్రం, ముప్పాళ్ల, ఉప్పుగుండూరు, ఈదుమూడి మట్టిగుంట తదితర గ్రామాల్లో కొమ్మమూరు కాలువ, పంపింగ్ స్కీము, చెరువుల ద్వారా మరో 5 వేల ఎకరాల్లో మాగాణి సాగు చేశారు. పండించిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవని కారణంగా ప్రైవేట్ వ్యాపారులకు 75 కేజీల బస్తా రూ.1300 నుంచి రూ.1350లకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె జయంత్ బాబు జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకొని పంట నూర్పిళ్ల సమయంలోనే కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో జీ బసవపున్నయ్య, యు వెంకటేశ్వర్లు, రావెళ్ల వెంకట్రావు, కొనికి కోటేశ్వరరావు, చేరుకూరి వాసు, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలివ్వాలి


జిల్లా పంచాయితీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు రమేష్

ఒంగోలు టౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ అనుబంధ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు యం.రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలే పంచాయతీల్లో పనిచేసే కార్మికులు రూ.6 నుంచి రూ.12 వేల తక్కువ వేతనాలకు ఉద్యోగాలు చేస్తుంటారని, అలాంటి చిరుద్యోగులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. జిల్లాలోని పంచాయతీ కార్మికులకు 5 నెలలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు ఇవ్వడం లేదని చెప్పారు. పనిచేసే సమయంలో ఏదైనా ప్రమాదానికి గురైనా వైద్య సదుపాయం కూడా కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. పారిశుధ్య కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు మట్టి ఖర్చులు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రమాదాల్లో మరణించిన పారిశుధ్య కార్మికులకు బీమా లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కూటమి పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17వ తేదీ విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పంచాయతీ కార్మికులందరూ ఈ మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏ.ఇశ్రాయేల్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఆర్.ప్రకాశం, యస్.ఎలీషా పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు


విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న పూర్వవిద్యార్థిని

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో దాతుల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మంగళవారం కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు వాగ్దేవి చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ సహకారంతో పెన్నులు, ప్యాడ్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అన్నపూర్ణ, సంస్థ వ్యవస్థాపకుడు సాయి ప్రణీత్, సిద్ధార్థ, కన్వీనర్ డాక్టర్ భరద్వాజ రావినూతల, గాలి ముసలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగంగుంటలో..

మద్దిపాడు: పదో తరగతి విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థి చేయూత అందించారు. మండలంలోని లింగంగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని కందుల రోజా పరీక్ష సామగ్రి ఆమె తండ్రి ఆదినారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈవో మెడబలిమి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు మెటీరియల్ లభించిన రోజాను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ముచ్చు సుబ్బారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కోసం పోరాటాలకు సిద్ధంకండి


వామపక్షాల అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కును కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టేందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్లో మంగళవారం నిర్వహించిన వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కుకు నామ మాత్రంగా ప్రభుత్వం రూ.15 వేల కోట్లు ఇచ్చిందని, ఆ నిధులు ఉద్యోగుల జీతాలు ఇవ్వడానికి కూడా సరిపోవన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ... విశాఖ ఉక్కుకు ముడి సరుకు ఇవ్వకుండా, ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. విశాఖ ఉద్యోగులు వారంతట వారే బయటకు వెళ్లేలా చేయడానికి అనేక కుట్రలకు పాల్పడుతుందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు తెరచి మాట్లాడడం లేదని మండిపడ్డారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు గత 1400 రోజులుగా పోరాటం కొనసాగుతుందని, ఆ పోరాట స్ఫూర్తితో ఈ నెల 14వ తేదీ సంఘీభావ దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్.లలిత కుమారి, కాలం సుబ్బారావు, గంటెనపల్లి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, ఆర్. మోహన్, ఎంఎస్ సాయి, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ-3 పథకంపై ఎంపీడీవో సమీక్ష

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదరణ-3 పథకం పనిముట్లకు సంబంధించి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డీ సురేష్ బాబు సమీక్ష నిర్వహించారు. మండల స్థాయిలో బీసీ వర్గీయులతో బీసీ వర్గాలకు చెందిన కుమ్మరి, రజక, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, వడ్డెర తదితర వర్గాలకు చెందిన వారి వృత్తిని బట్టి ఆదరణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉపయోగపడే పనిముట్లను త్వరలో అందజేయాలని ఈ మేరకు నిర్ణయించినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.


ఆదరణ పథకంపై సమీక్ష చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలన


కళాశాలను పరిశీలిస్తున్న డీఆర్వో చిన ఓబులేసు, పోలీసు అధికారులు

ఒంగోలు సిటీ: నీట్ (యుజీ)-2025 పరీక్ష మే నెల 4వ తేదీ నిర్వహించనున్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో సరైన వసతులు, రాకపోకల సౌలభ్యం, భద్రతా ప్రమాణాలు ఆడిట్ చేసేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేసు ఆరు సెంటర్లను తనిఖీ చేశారు. రైస్ కృష్ణ, రైస్ గాంధీ, రైస్ పాలిటెక్నిక్ కాలేజీలు, క్విస్ కాలేజీ, కేంద్రీయ విద్యాలయ, నెక్స్ట్ జెన్ స్కూళ్లను తనిఖీ చేసి ఫిజికల్ ఆడిట్ నిర్వహించారు. సదరు సెంటర్‌లలో గమనించిన విషయాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారికి సమర్పిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు. ఇందులో డీఆర్ఓ వెంట సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మనీష్, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన ఉద్యోగినులు


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగినులు

ఒంగోలు సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ తమీమ్ అన్సారీయాను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ కుంచాల కోటేశ్వరమ్మ, కన్వీనర్ సీహెచ్ శిరీష, రాష్ట్ర కన్వీనర్ పి.మాధవిల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఉద్యోగినుల మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం నాయకులు అంజనాదేవి, రత్నరాణి, నారాయణమ్మ, షమ్మీ, మల్లిక, కిరణ్మయి, సంతోషకుమారి, సుగుణ, శోభారాణి, గాలెమ్మ, సునీలకుమారి, స్వర్ణలత, జయమ్మ, తులసి, కవిత, అలేఖ్య, మస్తాన్‌బీ, జ్యోతిశ్రీ, మహేశ్వరి, యశోధ, పాపమ్మ, దేవమ్మ, హరిత, చైతన్య, ఏపీఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, కోశాధికారి కే.శివకుమార్, సహాధ్యక్షుడు ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామాంజనేయులు, బి.కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

యువత పోరుకు పోటెత్తాలి

- పోస్టర్లు ఆవిష్కరించిన ఎంపీపీ, నాయకులు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, పార్టీ శ్రేణులు

కొత్తపట్నం: నేడు ఒంగోలు కలెక్టర్ కార్యాయం వద్ద జరిగే ఫీజు పోరు కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పోటెత్తి విజయవంతం చేయాలని కొత్తపట్నం ఎంపీపీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు లంక పోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. కేపీ రెస్టారెంట్ ఆవరణలో మంగళవారం యువత ఫీజుపోరు వాల్ పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నేడు జరగబోయే ఫీజుపోరుకు మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలు ఉపయోగించుకుని ఎంతో మంది విద్యార్థులు జీవితాలు బాగుపడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావవస్తున్నా తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం బాధకరమన్నారు. విద్యార్థుల జీవితాలను కూటమి ప్రభుత్వం ఆడుకుంటుందని మండిపడ్డారు. అంతేకాక కూటమి ప్రభుత్వం గోకులల, ఇళ్ల స్కీమ్‌లు వంటివి పథకాలు కూటమి కార్యకర్తకే కట్టబెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరావు, చేనేత కార్మికుల అధ్యక్షుడు నాగరాజు, ఊడా సుబ్రహ్మణ్యం, గాలి మునరారెడ్డి, కోటిరెడ్డి, దొడ్ల రాజుగోపాల్‌రెడ్డి, ద్వారం మురళీ, మూగా బాలాజి, తాతా నాంచార్లు, తాతా శ్రీను, సుబ్రహ్మణ్యం, తుళ్లూరి వెంకటనారాయణ, బాజీ, హరినారాయణ, జిలాని, సంజీవురావు, కోడూరి బ్రహ్మారెడ్డి, స్వర్ణ సుబ్బారావు, సూరిశెట్టి సుబ్బారావు, మహిళా కార్యకర్తలు రమాదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మండల ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా రవికుమార్


రవికుమార్‌ను సత్కరిస్తున్న ఆర్‌ఎంపీల బృందం

సంతనూతలపాడు: మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా బోరుగడ్డ రవికుమార్ (సంతనూతలపాడు)ను మండల గ్రామీణ వైద్యులు మంగళవారం సంతనూతలపాడులో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఏ. వెంకట్రావు(పేర్నమిట్ట) పి. చైతన్య (మంగమూరు), గౌరవాధ్యక్షుడిగా దామోదర్, సెక్రెటరీగా యు మల్లికార్జునరావు(పీ గుడిపాడు), ట్రెజరర్‌గా ఎం. ప్రసాద్ (ఎండ్లూరు)లను ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక కార్యక్రమాన్ని జిల్లా ఆర్‌ఎంపీ వైద్యులు బట్టు బాలాజీ, సెక్రటరీ నాగరాజు, మాలకొండయ్యలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు మండలంలోని గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.